ముచ్చటగా.. మూడోసారి


మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కార్యాలయం

- ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు ఈనెలాఖరు వరకు పొడిగింపు
- పురపాలికల్లో మందకొడిగా సాగుతున్న చెల్లింపులు
- ఉమ్మడి పాలమూరులో 2.04 లక్షల దరఖాస్తులు
- ఇప్పటి వరకు 39,944 అర్జీలకే ఫీజు చెల్లింపు
- ఇంకా 80 శాతం పెండింగ్‌లోనే..

మహబూబ్‌నగర్,మే13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చిన విషయం తెలిసిందే. 2020 ఆగస్టులో దరఖాస్తు చేసుకున్న వారికి అప్పటి మార్కెట్ విలువ ప్రకారం ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించింది. రాయితీ ఇవ్వడం వల్ల దరఖాస్తుదారులు ముందుకు వస్తారని ఆశించినా, వారి నుంచి ఆసక్తి కరువైంది. దాంతో ప్రభుత్వం ఇచ్చిన గడువును పొడిగిస్తూ పోతోంది. ముందుగా మార్చి 31 నాటికి చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందని ప్రకటించగా, అప్పటికీ 10 శాతం దరఖాస్తులు కూడా రాకపోవడంతో గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. అయినా స్పందన అంతంతే ఉండటంతో ఈనెలాఖరు అంటే మే 31 వరకు ముచ్చటగా మూడోసారి గడువు పెంచింది. ఈ సారి కూడా నాలుగోవంతు దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కేవలం రూ.70 కోట్ల ఆదాయం

ఉమ్మడి పాలమూరులోని 20 మునిసిపాలిటీలు, ఓ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2,04,213 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వాటి నుంచి కనీసం రూ.500 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావించగా, ఈనెల 13 వరకు కేవలం రూ.70.74 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 39,944 దరఖాస్తులకు మాత్రమే ఫీజులు చెల్లించారు. అంటే ఇప్పటి వరకు కేవలం 19.55 శాతం దరఖాస్తులు మాత్రమే క్లియర్ అయ్యాయి. మొత్తం

(మిగతా 6లో..)

ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీల వారీగా దరఖాస్తులు, ఆదాయం వివరాలు

క్రసం	మునిసిపాలిటీ	మొత్తం దరఖాస్తులు	ఫీజు చెల్లించినవి	ఆదాయం (రూ.కోట్లల్లో)
1	మహబూబ్‌నగర్ (నగర పాలక సంస్థ)	31436	7450	17.83
2	కొల్లాపూర్	4595	715	1.24
3	దేవరకద్ర	6756	1038	1.69
4	అచ్చంపేట	12045	2618	2.73
5	కోస్గి	3982	966	1.95
6	మక్తల్	10577	1290	2.44
7	గద్వాల	14387	1845	2.96
8	అలంపూర్	431	122	0.16
9	పెబ్బేరు	7306	1567	1.89
10	అయిజ	9845	1158	1.47
11	మద్దూర్	1486	327	0.34
12	వనపర్తి	29083	5233	6.46
13	వడ్డేపల్లి	1941	379	0.74
14	అమరచింత	447	164	0.56
15	జడ్చర్ల	17686	2941	6.42
16	కొత్తకోట	7582	1206	4.30
17	నాగర్‌కర్నూల్	16158	2911	4.81
18	భూత్పూర్	6119	1382	2.71
19	కల్వకుర్తి	11482	2174	4.86
20	నారాయణపేట	7060	1643	4.20
21	ఆత్మకూర్	3812	823	0.98
	మొత్తం	2,04,213	39,944	70.74

కొల్లగొడుతూ.. కోట్లు సంపాదిస్తూ..


పర్దిపురం శివారులో మొరం తవ్వకాలు జరిగిన గుట్ట

- విచ్చలవిడిగా మొరం, ఇసుక, మట్టి దందాలు
- కనుమరుగవుతున్న వాగులు, వంకలు, గుట్టలు
- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు సతమతం


పట్టపగలే అయిజలో మొరం లోడుతో వెలుతున్న టిప్పర్ (ఫైల్).

అయిజ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సంపదను విచ్చలవిడిగా కొల్లగొడుతూ కోట్ల రూపాయలు వెనుకేసుకుంటున్నారు కొందరు అక్రమార్కులు. వాగులు, వంకలు, చెరువులు, గుట్టలు తేడా లేకుండా దందా నడిపిస్తూ దర్జాగా సంపాదించుకుంటున్నారు. తుంగభద్ర, కృష్ణా నదులకు మధ్యలో ఉండే గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలను నడిగడ్డ అని పిలుస్తారు. ఈ ప్రాంతంలో ఉండే అపారమైన ప్రకృతి సంపద అక్రమార్కులకు కలిసి వస్తోంది. పేరున్న నాయకుల పేర్లు చెప్పుకుంటూ కొందరు ఇసుక, నల్లమట్టి, ఎర్రమట్టి, మొరం దందాల్లో మునిగి తేలుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో సతమతం అవుతున్న అధికారులు వీటిని చూసీ చూడనట్లు వదిలేయాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జోగులాంబ గద్వాల జిల్లాలో..

- గద్వాల మండలంలోని చెనుగోనిపల్లి శివారులో ఉండే వజ్రాల గుట్ట నుంచి అనుమతులు లేకుండా మొరం తవ్వి తరలిస్తున్నారు. గతంలో పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి 10 ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుని కేసులు నమోదు చేశారు.
- అయిజ మండల పరిధిలోని పర్దిపురం గట్టు, ఆర్డీఎస్ కాలువ గట్ల నుంచి విచ్చలవిడిగా మొరం తరలిస్తున్నారు. తొత్తినోనిదొడ్డి, పులికల్, తాండ్రపాడు చెరువుల నుంచి నల్లమట్టి, తుంగభద్రనది నుంచి ఇసుకను అక్రమంగా అడ్డగోలుగా తరలిస్తున్నారు. ఇటీవల అయిజలో మొరం టిప్పర్లను, ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు.
- ధరూరు మండలంలోని 99వ ప్యాకేజీ కింద గుడెందొడ్డి రిజర్వాయర్ నుంచి ర్యాలంపాడు రిజర్వాయర్ వరకు ఉన్న కాలువ మట్టిని కొందరు దళారులు యథేచ్ఛగా తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు.
- కేటీదొడ్డి మండలంలోని పెద్ద మోరీలు, గువ్వలదిన్నె వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మల్లాపురం, కుచ్చినెర్ల శివార్లలోని ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు.
- ఎర్రవల్లి మండలంలో పుటాన్‌దొడ్డితిప్ప, తిమ్మాపురం గుట్ట మట్టి దందా అక్రమార్కులకు వరంగా మారింది.
- ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె శివారులో దేవాదాయశాఖ భూముల్లో ఇష్టానుసారంగా మట్టిని తవ్వి విక్రయిస్తున్నారు.
- వడ్డేపల్లి, రాజోలి మండలాల్లోని

(మిగతా 6లో..)

రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు..

ఈ దందాను నడిపించేందుకు ప్రతీ మండలంలో కొందరు బృందాలుగా ఏర్పడుతున్నారు. వారి కనుసన్నల్లోనే వ్యవహారం నడిచేలా చూసుకుంటున్నారు. వారికున్న రాజకీయ పలుకుబడితో అధికారులను మచ్చిక చేసుకుని దందా నడిపిస్తున్నారన్న విమర్శలున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో దూరాన్ని బట్టి ఒక టిప్పర్ మొరం రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు ధర ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ. 6 వేల నుంచి రూ. 8 వరకు పలుకుతున్నట్లు చర్చించుకుంటున్నారు. గ్రామాల పరిధిలో టిప్పర్ మొరం ధర రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకు, ట్రాక్టర్ అయితే రూ. 1000 నుంచి రూ. 1500 వరకు పలుకుతోంది.

మాయం అవుతున్న గుట్టలు



అక్రమంగా సాగుతున్న దందాలతో ఇప్పటికే చాలా చోట్ల పాత గుట్టలు కరిగిపోయాయి. ఈ అక్రమ దందాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపద మిగిలే అవకాశం లేదు. అవసరమైన పనులకు అనుమతితో తరలించుకునేందుకు అభ్యంతరం ఉండదు. కానీ అక్రమ సంపాదన కోసం అడ్డగోలు దందాలు చేయడం బాధాకరం.

- గాంధీ, రైతు, కొత్తపల్లి, అయిజ మండలం.


చిట్యాల వద్ద రైస్ మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

6


పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

అన్నదాతల ఆందోళన

- వీపనగండ్ల, పెంట్లవెల్లిలో రైతుల రాస్తారోకో
- పెబ్బేరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

6

కొండపాలైన రూ.7 కోట్లు

- నిరుపయోగంగా శ్రీశైలం డైవర్షన్ రోడ్డు
- 20 ఏళ్లుగా పూర్తి కాని పనులు
- అప్పట్లో అటవీ శాఖ అభ్యంతరంతో నిలిపివేత
- పూర్తి చేసి వినియోగించుకునేందుకు ముందుకొచ్చిన జెన్‌కో
- 2022లోనే అనుమతించిన నీటిపారుదల శాఖ
- ఇటీవల పరిశీలించిన జెన్‌కో అధికారులు
- రోడ్డు ప్రారంభంలో అడ్డుగా ఉన్న 400 కేవీ విద్యుత్ స్తంభం తొలగింపునకే రూ.4 కోట్ల ఖర్చు

దోమలపెంట, మే 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదకర మలుపులను తప్పించేందుకు, వర్షాకాలంలో కొండ చరియలు విరిగి పడుతుండటంతో ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు నిర్మించ తలపెట్టిన డైవర్షన్ రోడ్డు ఏళ్ల తరబడి పూర్తి కావడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 2004లో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.7 కోట్లతో ఈ పనులు చేపట్టారు. శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి ఈగలపెంట దిగువన హన్మకొండ మలుపు ప్రాంతం నుంచి నేరుగా శ్రీశైలం బ్రిడ్జి వరకు వాహనాలు వెళ్లేందుకు రోడ్డును నిర్మించాల్సి ఉంది. పనులు 90 శాతం పూర్తి కాగా, అప్పట్లో అటవీశాఖ అధికారులు ఇది రిజర్వ్ ఫారెస్టు పరిధిలోనిదని అభ్యంతరం తెలుపడంతో నిలిచిపోయాయి. సుండిపెంటకు చెందిన కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుండానే, అధికారులపై రాజకీయంగా ఒత్తిళ్లు తెచ్చి పూర్తి బిల్లులు పొందినట్లు సమాచారం. రూ.కోట్లు ఖర్చు చేసినా డైవర్షన్ రోడ్డు పూర్తి కాకపోవడంతో ప్రజా ధనం దుర్వినియోగం అయ్యింది.


పాతాళగంగ వద్ద పూర్తికాని శ్రీశైలం డైవర్షన్ రోడ్డు(ఎడమ వైపున)

ప్రమాద పరిస్థితులను అరికట్టేందుకు..

ఈగలపెంట నుంచి ఎడమ పాతాళగంగ వరకు 5 కిలో మీటర్ల దూరం ఉంటుంది. అక్కడి నుంచి శ్రీశైలం డ్యాం సమీపం వరకు రోడ్డు పలుచోట్ల ప్రమాదకరంగా మలుపులు తిరిగి ఉంది. ఏటా వర్షాకాలంలో మూడు నెలల పాటు డ్యాం గేట్లు ఎత్తి, నీటిని దిగువకు విడుదల చేస్తారు. ఆ సమయంలో గేట్ల నుంచి కిందకు దూకే నీరు సమీపంలోని రోడ్డుపై వర్షం మాదిరి పడుతుంది. దాంతో రోడ్డు కనిపించక వాహనదారులు

(మిగతా 6లో..)

రైతులు ఆందోళన చెందొద్దు

- తడసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


కొల్లాపూర్ మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 13(ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని తెలిపారు. ఈ విషయంపై సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్యతో మంత్రి మాట్లాడారు. తేమ శాతం 14కు మించని ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తేమ ఎక్కువగా ఉన్నా, తాలు ఉన్నా మిల్లర్లు వెనక్కి పంపిస్తున్నారని చెప్పారు. రైతులు తప్పనిసరిగా తాలు లేని ధాన్యాన్ని తేవాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ పసుపుల నరసింహ, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

'ఇందిరా సౌరగిరి'తో చెంచుల అభివృద్ధి

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్
- సీఎం పర్యటనకు కొనసాగుతున్న ఏర్పాట్లు

6

ప్రశాంతంగా పాలిసెట్

- జిల్లా వ్యాప్తంగా 95.61 శాతం హాజరు


గద్వాలలో పరీక్ష రాసి బయటికి వస్తున్న అభ్యర్థులు

గద్వాల సర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు నిర్ణీత సమయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. గద్వాల శివారులోని గోనుపాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 1,780 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,702 మంది (95.61శాతం) హాజరయ్యారని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ రామ్మోహన్ తెలిపారు.

నిజాయతీని చాటుకున్న టైలర్

» బాధితురాలికి బంగారు గొలుసు అప్పగింత



బాధితులకు బంగారు గొలుసును అప్పగించిన పోలీసులు

వడ్డేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : లక్ష రూపాయల విలువైన బంగారు గొలుసును పోలీసులకు అప్పజెప్పి నిజాయితీ చాటుకున్నాడు ఓ టైలర్. సంఘటనకు సంబంధించి శాంతినగర్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ మసీదు సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద ఒక మంగళవారం ఉదయం ఒక హ్యాండ్‌బ్యాగ్ ఉండగా, టైలర్ ఆంజనేయులు అనే వ్యక్తి గమనించాడు. బ్యాగు తెరిచి చూడగా, బంగారు గొలుసు, టాబ్లెట్లకు సంబంధించిన రసీదులు కనిపించాయి. ఈ విషయాన్ని తనకు తెలిసిన ఫొటోగ్రాఫర్ రమేశ్‌కు తెలిపాడు. ఇద్దరూ కలిసి చుట్టుపక్కల వారిని విచారించగా తమది కాదని వారు తెలిపారు. దీంతో వారిద్దరూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఏఎస్‌ఐ బాషాకు హ్యాండ్ బాగును అప్పగించారు. బ్యాగ్‌లో గొలుసుతో పాటు బిల్లు కూడా ఉంది. శాంతినగర్‌లోని ఆర్ ఆర్ పాపయ్యశెట్టి వద్ద కొన్నట్లు అందులో రాసి ఉంది. పోలీసులు ఆ బిల్లును వాట్సప్‌లో వారికి పంపి ఆరా తీశారు. అది షాబాద్‌కు చెందిన తహెరాబేగంకు సంబంధించినదని తేలింది. ఆమెను స్టేషన్‌కు పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. శాంతినగర్‌లోని కుమార్తె గౌసియా బేగం, అల్లుడు రఫీలతో షాబాద్ గ్రామానికి వెళ్తూ, ఆటో స్టాండ్ వద్ద బ్యాగును మరిచి పోయినట్లు ఆమె తెలిపింది. దీంతో పోలీసులు ఆమెకు బ్యాగును అప్పగించారు. నిజాయతీని చాటుకున్న టైలర్ కొంకల అంజనేయులు, ఫొటోగ్రాఫర్ రమేష్ లను సీఐ టాటా బాబు, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి, ఏఎస్‌ఐ బాషా, కానిస్టేబుల్ మస్తాన్ అభినందించారు.

గట్టులో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

గద్వాల/నారాయణపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం కూడా ఎండల తీవ్రత కొనసాగింది. సోమవారం సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసినా ఎండల తీవ్రత మాత్రం నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టులో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.1 డిగ్రీలు నమోదైంది. అలంపూర్‌లో 39.9, అయిజలో 39.8, గద్వాలలో 39.7, కేటీదొడ్డిలో 39.6, ధరూర్‌లో 39.5, రాజోలిలో 39.4, ఇటిక్యాలలో 39.1 డిగ్రీలు నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 23.3 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 38.5, కనిష్ఠం 24.3 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 37, కనిష్ఠం 25 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 36 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీలు నమోదైంది.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

» వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, మే 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బంది కలగకుండా, మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకుని లారీలను పంపించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి జిల్లాలోని రాజనగరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చిట్యాల వద్ద ఉన్న వేంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లును మంగళవారం ఆయన పరిశీలించారు. అకాల వర్షాలు పడుతుండడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయి, రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి మిల్లుకు లారీల్లో వచ్చిన ధాన్యాన్ని వెంటనే దించుకోవాలన్నారు. సన్న రకంతో పాటు దొడ్డు రకం వడ్లు కూడా తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను, రాజనగరం కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన వడ్లను ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు తేమ శాతం ఉన్న వడ్లను తూకం వేసి మిల్లుకు పంపించాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, తహసీల్దార్ రమేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కొండపాలైన రూ.7 కోట్లు



ముళ్ల పొదలతో నిండిపోయిన డైవర్షన్ రోడ్డు

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఈగలపెంట నుంచి ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం ముఖ ద్వారం వరకు కొండ చరియలు విరిగి పడుతుండటంతో ఇరుకుగా ఉన్న రోడ్డుపై వచ్చిపోయే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రమాదకర మలుపులతో పాటు దూరాన్ని 3.5 కిలో మీటర్ల నుంచి ఒక కిలో మీటరు లోపు కుదించి, సురక్షిత ప్రయాణం చేసేందుకు వీలుగా ఈ డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.

అభ్యంతరాలు.. అవాంతరాలు

శ్రీశైలం డైవర్షన్ రోడు పనులు సకాలంలో పూర్తి చేసి, వినియోగంలోకి తేవడానికి రెండు ప్రధాన కారణాలు సవాలుగా మారాయి. ఈగలపెంట దిగువన హస్మకొండ మలుపు నుంచి శ్రీశైలం బ్రిడ్జి వరకు కొండను తొలచి డైవర్షన్ రోడ్డు పనులు చేట్టారు. 1964 సంవత్సరంలో డ్యాం నిర్మాణ సమయంలో ఎడమ వైపు ఉన్న దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ ప్రాంతాలను కలిపి 890 ఎకరాల అటవీ భూమిని అప్పట్లో ప్రభుత్వం నీటి పారుదల శాఖకు బదలాయించింది. ఆ బదలాయించిన స్థలంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. కానీ అప్పట్లో అటవీ శాఖ అధికారులు ఆ భూమి రిజర్వు ఫారెస్టులో ఉన్నదని, రోడ్డు పనులను అడ్డగించడంతో కాంట్రాక్టరు పనులు నిలిపి వేశారు. అప్పట్లో ఆధారాలు సరిగా చూపకపోవడంతో పనులు నిలిచిపోయాయి. నేడు తెలంగాణ ప్రభుత్వ పరిధిలోకి రావడంతో ప్రస్తుతం ఏఎంఆర్(ఎలిమినేటి మాధవరెడ్డి) ప్రాజెక్టు పరిధిలోనే ఆ స్థలం ఉన్నది. ప్రస్తుతం రోడ్డు డైవర్షన్ చేసే ప్రాంతంలో మొదట్లోనే 400 కేవీ విద్యుత్ స్తంభం ఉన్నది. రోడ్డు పనులు పూర్తి అయినా విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తే తప్ప ఉపయోగం లేదు. ప్రస్తుత పరిస్థితులో 400 కేవీ స్తంభం తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలంటే, రెండు నెలల వ్యవధితో పాటు సుమారు రూ.4 కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉన్నదని కొందరు జెన్‌కో ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

వినియోగంలోకి తెచ్చేందుకు జెన్‌కో ప్రయత్నం..

సుమారు ఇరవై సంవత్సరాల క్రితం డైవర్షన్ రోడ్డు పనులు నిలిచిపోవడంతో అక్కడ అంతా ముళ్ల పొదలు అలుముకున్నాయి. వర్షాకాలంలో శ్రీశైలం ఘాట్ రోడ్డుపై కొండ చరియలు విరిగిపడి రాకపోకలకు కొంత ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విధులకు వెళ్లేందుకు ఆలస్యం, ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు డైవర్షన్ పనులను తాము పూర్తి చేసి, వినియోగంలోకి తెచ్చేందుకు అనుమతి ఇవ్వాలని ఈగలపెంట జెన్‌కో సంస్థ నీటి పారుదల శాఖ అధికారులను కోరింది. 2022లోనే జెన్‌కో సంస్థకు అనుమతులు ఇచ్చారు. ఈ రోడ్డు పనులను గతంలో ప్రజాధనంతో చేపట్టినందున ప్రస్తుతం పనులు పూర్తి చేసిన జెన్‌కోకు ఎటువంటి హక్కులు ఉండవని, శ్రీశైలం వచ్చి పోయే వాహనాలకు ఎటువంటి అభ్యంతరాలు చెప్పరాదని, ఈ రోడ్డు ఎప్పటికీ నీటి పారుదల శాఖ పరిధిలోనే ఉంటుందనే షరతులతో ఈ అనుమతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్తంభం తొలగింపు, రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అంచనా కోసం స్థానిక జెన్‌కో సంస్థ అధికారులు ఇటీవల పరిశీలించారు.

అందరికీ ఉపయోగంగా ఉండేలా షరతులు

శ్రీశైలం డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేసి, వియోగించుకునేందుకు స్థానిక జెన్‌కో అధికారులు కోరగా కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇచ్చాం. ఈ రోడ్డు పనులు పూర్తయితే సురక్షిత ప్రయాణంతో పాటు, ఘాట్ రోడ్డు ప్రయాణం కూడా తగ్గుతుంది. అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

- శ్రీనివాస్, ఏఎంఆర్ ప్రాజెక్టు డీఈ

ఫుల్ జోష్.. ఫ్యూచర్ ఛాంప్స్



» వేసవి శిక్షణా శిబిరాల్లో చిన్నారుల సందడి
» క్రీడా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ
» చిన్నారుల సాధనతో మైదానాలు కళకళ



వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు



అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడా శిక్షణా శిబిరాలతో మైదానాలు, అకాడమీలు, ఇన్‌డోర్ స్టేడియాలు కళకళ లాడుతున్నాయి. శిక్షణ పొందుతూ, సాధన చేస్తున్న చిన్నారులతో క్రీడా మైదానాలు సందడిగా కనిపిస్తున్నాయి. క్రీడాశాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రధాన స్టేడియం సహా ఇతర మైదానాల్లో ఈ శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆసక్తి ఉన్న క్రీడల్లో చిన్నారులకు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తూ, మెళకువలను నేర్పిస్తుండటంతో 'ఫ్యూచర్ ఛాంప్స్'లో జోష్ కనిపిస్తోంది.

విద్యార్థులల్లో జోష్...

వేసవి క్రీడా శిబిరాల్లో చిన్నారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. నిరాశ, నిస్పృహలను వదిలేసి కొత్త ఉత్సాహంతో పరవళ్ల తొక్కుతున్నారు. దీంతో గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాలు ఉత్సాహపూరిత వాతావరణం లో కొనసాగుతున్నాయి. వేసవి తీవ్ర తను దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిబిరాలను నిర్వహిస్తున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, చెస్ తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు శిక్షణ పొందు తున్నారు. గతంలో నిర్వహించిన వేసవి శిబిరాల్లో శిక్షణ పొందిన ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ఛాంపియన్లుగా నిలిచారు.

ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారు



వేసవి శిబిరాల్లో శిక్షణతో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు. దాదాపు 14 సంవత్సరాలుగా అథ్లెటిక్ కోచ్‌గా స్టేడియంలో వేసవి శిక్షణ ఇస్తున్నాను. మా వద్ద శిక్షణ పొందుతున్న ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగారు. క్రీడా కోటలో ఉద్యోగాలు పొందిన వారూ ఉన్నారు. కొందరు ఇటీవలే ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు.

- సునీల్‌కుమార్, అథ్లెటిక్ కోచ్, మహబూబ్‌నగర్

జాతీయ స్థాయికి ఎదిగారు



ప్రతీ ఏడాది క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్ వేసవి శిబిరాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. ప్రతీ క్రీడాకారుడిపై ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ ఇచ్చి, మెళకువలను నేర్పిస్తాం. ఎంతో ఉత్సహంగా చిన్నారులు, యువత శిక్షణ శిబిరాల్లో పాల్గొంటున్నారు.

- పర్వేజ్, వాలీబాల్ కోచ్, స్టేడియం

శిక్షణ చాలా బాగుంది



స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శిక్షణ పొందుతున్నాను. అథ్లెటిక్స్‌లో మెళకువలను చాలా బాగా నేర్పిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం శిక్షణతో పాటు అథ్లెటిక్స్‌పై అవగహన కల్పిస్తున్నారు. క్రీడల్లో రాణించి జిల్లా జట్టుకు ఎంపిక అవుతాను.

- మహ్మద్ అమన్, విద్యార్థి

మెళకువలు నేర్పిస్తారు



వేసవి శిబిరాల్లో కోచ్‌ల పర్యవేక్షణలో మెళకువలు నేర్పిస్తారు. స్టేడియంలో మూడు ఏళ్లుగా వాలీబాల్ క్రీడలో శిక్షణ పొందుతున్నా. వేసవి క్రీడా శిబిరాలు చాల ముఖ్యమైనవి. కోచ్‌లు ఇచ్చే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. గత ఏడాది జాతీయ స్థాయి టోర్నీలో అండర్-14 బాలుర రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాను.

- గౌతమ్, వాలీబాల్ క్రీడాకారుడు

అన్నదాతల ఆందోళన

» వీపనగండ్ల, పెంట్లవెల్లిలలో రైతుల రాస్తారోకో
» పెబ్బేరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



పెబ్బేరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వీపనగండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం అన్నదాతల ఆందోళన బాట పట్టారు. ఉమ్మడి జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో మంగళవారం వారు రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల కేంద్రంలో మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై ధాన్యం కొనుగోలు చేయడం లేదని, తాలు, తరుగు పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. తూముకుంట సింగిల్ విండో సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో దాదాపు రెండు గంటల పాటు కొనసాగడంతో వాహనాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. అదే దారిలో వెళ్తున్న తహసీల్దార్ వరలక్ష్మి వాహనం కూడా నిలిచిపోవడంతో వెంటనే పోలీసులను సమాచారం అందించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో మోసాలని అరికట్టాలని, గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని రైతులు నినాదాలు చేశారు. తాలు, తరుగు పేరుతో 40 కిలోల బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోలు అదనంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. గన్నీ బ్యాగులు లేక తరుచూ కొనుగోళ్లు నిలిపి వేస్తున్నారని, సకాలంలో లారీలు రాక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరలక్ష్మి, ఏఎస్‌ఐ చంద్రారెడ్డి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఆందోళనలో రైతులు వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీను, ఉషన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

పెంట్లవెల్లి, (ఆంధ్రజ్యోతి) : తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా, జటప్రోలుకు చెందిన రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం సభ్యులు తేమ పేరుతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఖాతాల్లో డబ్బు జమ చేయాలని కోరారు. పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు నచ్చచెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఆందోళనలో మాజీ సర్పంచు ఎస్‌కే ఖాజా, రైతులు ఈశ్వర్‌రెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

పెబ్బేరు (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపల్ కేంద్రంలో మంగళవారం వారు రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. ధాన్యం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ధాన్యాన్ని కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మాజీ చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కర్రెస్వామి, నాయకులు శేఖర్ గౌడ్, ఎల్లయ్య, సహదేవుడు, రాజశేఖర్, మజీద్, రమేశ్, సంతోష్, జగన్నాథం, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ఫలితాలు విడుదల

బిజినేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ పరీక్షల ఫలితాలు మంగళ వారం విడుదలయ్యాయి. ఫలితాల్లో మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ తెలిపారు. వందశాతం ఉత్తీర్ణతతో పాటు 10వ తరగతిలో 90 శాతం మంది విద్యార్థులు, 12వ తరగతిలో 68 శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ జానకి రాములు, అధ్యాపకులు భాస్కరాచారి, వెంకట్ రెడ్డి అభినందించారు.

కొల్లగొడుతూ.. కోట్లు సంపాదిస్తూ..

(5వ పేజీ తరువాయి)

బుడమొర్సు గొల్లగట్టు, శివాలయం, తనగల గట్ల నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారు. దీంతో పాటూ తుంగభద్ర నది అంచున దొడ్డు ఇసుక పేరుతో ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా కొనసాగుతోంది.

● మల్దకల్ మండలంలోని ర్యాలంపాడు కాలువ వెంట దాదాపు 6 కిలోమీటర్ల దూరంలో ఉండే కాలువగట్టు మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారు.



అయిజ మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్లు

తరలింపునకు అనుమతి లేదు



చెరువుల నుంచి నల్లమట్టి తరలింపునకు అనుమతి లేదు. గతంలో పొలాలకు మట్టి తరలించుకునేందుకు రైతులకు అనుమతి ఇచ్చాం. ప్రస్తుతం ఒక రైతుకు అనుమతి ఇచ్చే అవకాశం లేదు. అయితే గ్రామాన్ని యూనిట్‌గా చేసుకుని 20 మంది రైతులకు తక్కువ కాకుండా దరఖాస్తు చేసుకుంటే, కలెక్టర్ ఆదేశంతో అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. అనుమతి లేకుండా చెరువుల్లో పూడిక మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

- విజయ్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ, గద్వాల

తప్పనిసరి అవసరాలకు అనుమతి



జిల్లాలోని ఏ ప్రాంతం నుంచి అయినా నిబంధనల మేరకే మొరం, మట్టి తరలించేందుకు అనుమతులు మంజూరు చేస్తాం. ప్రభుత్వ పనులకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతి ఇస్తాం. ప్రకృతి సంపదను కాపాడే బాధ్యత అధికారులపైనే కాకుండా ప్రజలపైనా ఉంటుంది. ఎవరైనా అనుమతి లేకుండా మట్టి, మొరం, ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాము. ఇటువంటి వ్యవహారాలను ఉపేక్షించం.

- రమణ, మైనింగ్ అధికారి, గద్వాల

'ఇందిరా సౌరగిరి'తో చెంచుల అభివృద్ధి


» రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్
» సీఎం పర్యటనకు కొనసాగుతున్న ఏర్పాట్లు



మాచారంలో సీఎం పర్యటన ఏర్పాట్లను నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్‌తో కలిసి పర్యవేక్షిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్

మన్ననూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : 'ఇందిరా సౌరగిరి జల వికాసం' ఆదివాసీ చెంచు రైతుల జీవితాల్లో వెలుగులు నింపి వారి అభివృద్ధికి దోహదపడుతుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా, అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఈ నెల 18న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఆయన మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామంలో 27 మంది చెంచు రైతులకు సంబంధించిన 50 ఎకరాల్లో బోర్లు వేయించి, సౌర పంపుసెట్లను ఏర్పాటు చేసి, పండ్ల మొక్కలను నాటి అప్పగించనున్నట్లు తెలిపారు. వేసిన బోర్లు అన్నింటిలో పుష్కలంగా నీరు పడిందని చెప్పారు. పండ్ల తోటలను పెంచుతూనే అంతర పంటలుగా ఆరుతడి పంటలైన శనగ, వేరుశనగ, పత్తి, బెబ్బర్లు, మిర్చి సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక చెంచులు పలు సమస్యలను ప్రస్తావించగా, ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెంచు రైతులను పండల్ల తోటలు పెంచే ప్రాంతాలకు తీసుకెళ్లి సాగు సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇప్పిస్తామన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ, పండ్ల తోటల కోసం మొక్కలను సిద్ధంగా ఉంచామన్నారు. పంటలకు నీటి సదుపాయంతో పాటుగా స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అనంతరం సభా ప్రాంగణం, హెలీప్యాడ్, సీఎం ప్రారంభించనున్న బోరుబావులను పరిశీలించారు. 15వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎఫ్‌వో, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో రోహిత్ గోపిడి, ఉద్యానవన శాఖ జేడీ బాబు, డీడీ వెంకటేశం, డీటీడీవో ఫిరంగి, డీఆర్‌డీవో పీడీ చిన్న ఓబులేసు, డీపీవో రాంమోహన్‌రావు, భూగర్భ జల శాఖ ఏడీ దివ్యజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేలత, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి



పాలమూరు ముఖచిత్రం

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులకు ఫీజులు చెల్లిస్తే మరో రూ.300-400 కోట్ల ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, వనపర్తి, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, కొత్తకోట, కల్వకుర్తి, నారాయణపేట మునిసిపాలిటీల్లో మాత్రమే కొంత ఆదాయం సమకూరింది. పలు మునిసిపాలిటీలో నామమాత్రపు దరఖాస్తులకు ఫీజులు చెల్లించారు.

మూడు నెలలు గడువిచ్చినా..

ప్రభుత్వం మూడు నెలలు గడువు ఇచ్చినా దరఖాస్తుదారుల్లో ఆసక్తి లేకపోవడం గమనార్హం. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు చూపిన ఉత్సాహం ఫీజులు చెల్లించి, క్రమబద్ధీకరణ చేసుకోవడంలో కనిపించడం లేదన్న విషయం స్పష్టమవుతోంది. అసలు ఎందుకు ఇలా జరుగుతుందో అధికార యంత్రాంగం తేల్చలేకపోతోంది. గడువు మాత్రమం పొడగిస్తూ పోతున్నారు. అసలు దరఖాస్తు చేసుకున్న లేఅవుట్‌లపై విచారణ చేయిస్తే అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి. వీటిలో చాలావరకు ఇదివరకే దొంగచాటున క్రమబద్ధీకరణ చేసుకున్నారని, అందుకే ప్రభుత్వం ఎన్ని అవకాశాలిచ్చినా దరఖాస్తు దారులు ముందుకు రావడం లేదన్న విమర్శలు లేకపోలేదు. దీనిపై యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారిస్తే అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి.

క్రైం కార్నర్

అప్పులబాధతో మునిసిపల్ ఉద్యోగి ఆత్మహత్య

జడ్చర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలో కామాటిగా విధులు నిర్వహిస్తున్న బాల్‌నగర్ చెన్నకేశవులు(38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో చెన్నకేశవులు నివాసం ఉంటున్నాడు. నాలుగు నెలల క్రితం మహబూబ్‌నగర్‌లోని ఓ ఫైనాన్స్ కంపెనీలో రూ.4లక్షల రుణం తీసుకున్నాడు. ఈఎంఐ కట్టాలంటూ సదరు ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగులు చెన్నకేశవులుకు ఫోన్ చేసేవారు. చేసిన అప్పుల అంశంపై మానసికంగా బాధపడుతూ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వివరించారు.

లాడ్జిలో యువకుడు..

నాగర్‌కర్నూల్ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని తిరుమల లాడ్జిలో సోమవారం రాత్రి దాంగట్ల ఉపేందర్(23) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సాయంత్రం స్నేహితుల వెంట వెళ్లి పార్టీ చేసుకుని రాత్రి ఆత్మహత్య చేసుకోవడంపై తీవ్ర అనుమానం కన్పిస్తుందని తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

అచ్చంపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం బావిలో లభించింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం ఓ వ్యక్తి మద్యం తాగి గ్రామ శివారులో ఉన్న పీర్లబావి గోడ అంచున కూర్చొని ఉండగా చూసినట్లు తెలిపారు. ఎప్పుడుపడ్డాడో తెలియదు కాని మరుసటి రోజు మృతదేహం తీయడానికి స్థానికులు ప్రయత్నం చేశారు. విషయం పోలీసులకు తెలుపగా మంగళవారం ఎట్టకేలకు మృతదేహాన్ని బయటకు తీశారు. ఎవరైనా వస్తే వారికి అప్పజెప్తామని సిద్ధాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఐనోల్ తండాలో వ్యక్తి అనుమానాస్పద మృతి

» పరారీలో భార్య

అచ్చంపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సిద్ధాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్‌తండాకు చెందిన మాదేవి శ్రీశైలం (35) అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మాదేని శ్రీశైలం మేస్త్రీ పనులు చేసేవాడు. మద్యం తాగి భార్య ఉదయలక్ష్మితో గొడవ పడేవాడు. వీరికి ఒక పాప ఉంది. మూడు రోజుల నుంచి ఇంటికి తాళం వేసి ఉండడం, ఇంట్లో ఎలాంటి చప్పుడు లేకుండా ఉండటం, కుమారుడి స్కూటర్ ఇంటి బయట చూసిన తల్లి వెంకటమ్మ అనుమానించి ఆదివారం తలుపులు తెరిపించింది. ఇంట్లో శ్రీశైలం మృతిచెంది ఉన్నాడు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్య ఉదయలక్ష్మి పరారైందని, మానసికస్థితి బాగుండదని, ఆమె కోసం వెతుకుతున్నట్లు సిద్ధాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవాలయంలో ఆభరణాలు చోరీ

అచ్చంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల గ్రామం మారింది. ఇటీవల వ్యవసాయ బోరు మోటార్లు, స్టార్టర్లు దొంగిలించారు. ఇది ఇలా ఉండగానే ఆదివారం రాత్రి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కిరీటాలు, శఠగోపురం, హారతి పల్లెం ఎత్తుకెళ్లారు. వీటి విలువ దాదాపు రూ.లక్షకు పైగాఉంటుందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జడ్చర్లలో తాళం వేసిన ఇంట్లో..

» బంగారు, వెండి వస్తువులు మాయం

జడ్చర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని సాయినగర్‌కాలనీలో వియ్యూరు రామకృష్ణారెడ్డి ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణ జిల్లా రెడ్డిగూడెం మండలం రాఘవపురానికి చెందిన రామకృష్ణారెడ్డి ఉద్యోగ రీత్యా 15 ఏళ్లుగా జడ్చర్లలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 10న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి సొంత గ్రామానికి వెళ్లారు. తిరిగి మంగళవారం జడ్చర్లకు వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడం, బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు సమాచారం చేరవేశాడు. బీరువాలో దాచిన మూడు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులతో పాటు కొంత నగదు ఎత్తుకెళ్లారని రామకృష్ణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పింజర్‌గుట్టపై చిరుత ప్రత్యక్షం

కోయిలకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని పింజర్‌గుట్టపై మంగళవారం సాయంత్రం చిరుత సంచరిస్తు ప్రజలకు కనిపించింది. గుట్టలోని బందేనవాజ్ పక్కనే ఉన్న ఎత్తయిన బండరాయిపై చిరుత ఉండడాన్ని ప్రజలు గమనించి ఇళ్లపై నిలబడి వీక్షించారు. రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో ఆవు దూడలపై చిరుత దాడి చేసిందని రైతులు తెలిపారు. వేసవి కాలం ఉన్నందున నీరున్న ప్రదేశాలకు చిరుతలు వలస వెళ్తాయని, జనాలకు ఎలాంటి హాని తలపెట్టవని అటవీశాఖ అధికారులు తెలిపారు.

యువకుడి అదృశ్యం: కేసు నమోదు

మిడ్జిల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన శేఖర్ కనిపించడంలేదని తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు మంగళవారం తెలిపారు. ఇంట్లో మొబైల్ చూస్తుంటే మందలించడంతో సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు తెలిపారు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేదన్నారు.

పాన్‌గల్‌లో మహిళ..

పాన్‌గల్: మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. శిక్షణ ఎస్‌ఐ హిమబిందు తెలిపిన వివరాల ప్రకారం... కేతేపల్లి గ్రామానికి చెందిన గుజ్జుల పద్మ మార్చి 30వ తేదీ నుంచి కనిపించడం లేదని భర్త గుజ్జుల నిరంజన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. భర్త నిరంజన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

పాన్‌గల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో 9 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పెంటయ్య బహదూర్ గూడెం శివారులో గొర్రె పిల్లలను కంచెలో ఏర్పాటు చేసి గొర్రెల మందను మేపేందుకు తీసుకెళ్లాడు. కంచెలో ఉన్న గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన గొర్రె పిల్లల విలువ రూ.25వేలు ఉంటుందని ఆయన తెలిపారు.

అదుపు తప్పిన బైక్ : చిన్నారి చేతికి గాయం

ఉండవల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో ఓ చిన్నారి గాయపడింది. అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. ధరూర్ మండలానికి చెందిన పరశురాముడు, భార్య, కూతురు గౌతమితో కలిసి పనినిమిత్తం బైక్‌పై కర్నూలుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అలంపూర్‌చౌరస్తా ఫంక్షన్‌హాల్ వద్దకు రాగా కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో గౌతమి చేతికి తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి వచ్చిన ఈఎంటీ రాజరత్నం, పైలెట్ రవి చిన్నారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

‘పీఎం విశ్వకర్మ’ కరుణించేనా?

» ఉమ్మడి జిల్లాలో నత్తనడకన అమలు
» 40 శాతం పెండింగ్‌లోనే..
» టైలరింగ్, తాపీ మేస్త్రి, కార్పెంటర్ వృత్తుల దరఖాస్తులు నిలుపుదల
» శిక్షణ, రిజిస్ట్రేషన్ పేరుతో కాలయాపన
» రుణాల కోసం ఎదురుచూపులు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కుండలు తయారు చేస్తున్న కుమ్మరి

పాలమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో నైపుణ్యం పెంచుకుంటూ జీవించే వారికి ఆర్థిక చేయూత అందించి అండగా నిలవాలని కేంద్రం ‘పీఎం విశ్వకర్మ’ పథకాన్ని 20 నెలల క్రితం (17 సెప్టెంబర్ 2023) ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఉమ్మడి జిల్లా (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట)కు నోడల్ అధికారులు బాధ్యత తీసుకున్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత మేలు కలిగే అవకాశం ఉందని విశ్వకర్మ చేతివృత్తిదారులు కోరుతున్నారు.

ఎవరెవరు అర్హులు?

ఈ పథకం కింద రుణం పొందాలనుకునేవారు 18 ఏళ్లు నిండి ఉండాలి. ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారుంటే అనర్హులు. ముద్ర రుణాలు పొంది పూర్తిగా చెల్లించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఒక్కరికే లబ్ధి చేకూరుతుంది.

7,970 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో ఈ పథకానికి 7,970 (మహబూబ్‌నగర్ - 1,652, నాగర్‌కర్నూల్- 1,501, నారాయణపేట - 682, వనపర్తి - 1,040, గద్వాల-3,095) చేతి వృత్తిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 5,648 (మహబూబ్‌నగర్ 1,483, నాగర్‌కర్నూల్ 827, నారాయణపేట 559, వనపర్తి 995, గద్వాల 1,784 మందికి ఎంపిక చేయగా, ఇంకా 2,322 (మహబూబ్‌నగర్ 169, నాగర్‌కర్నూల్ 674, నారాయణపేట 123, వనపర్తి 45, గద్వాల 1,311) దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. ఎంపిక చేసినవారందరికి శిక్షణ ఇవ్వడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఈ పథకంతో ఎప్పటికీ లబ్ధి చేకూరుతుందని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నత్తనడకన ప్రక్రియ

పీఎం విశ్వకర్మ పథకం యువత, ప్రజల్లో ప్రభావం తగ్గుతోంది. 2023-24లో మహబూబ్‌నగర్ జిల్లాలో 2,796 దరఖాస్తులు వచ్చాయి. అందులో 734 ఎంపిక కాగా, 2,062 మిగిలాయి. 2024-25లో 1,652 జిల్లా అంతటా దరఖాస్తులు వస్తే, అందులో 1,483 ఎంపికయ్యాయి. ఇంకా 169 దరఖాస్తులు మిగిలాయి. దీనికి ప్రధాన కారణం నూటికి 60-70శాతం టైలరింగ్, తాపీ మేస్త్రి, కార్పెంటర్ వృత్తులకు అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. 17 సెప్టెంబరు 2024న ఆ మూడు ట్రేడ్‌ల నుంచి దరఖాస్తులు తీసుకోవటం ప్రభుత్వం ఆపేసింది. దీంతో దరఖాస్తులు తగ్గిపోయాయి.

ఆసక్తి ఉన్న వాటిపై శిక్షణ ఇవ్వాలి



పీఎం విశ్వకర్మ యోజనలో దరఖాస్తుదారులకు ఆసక్తి ఉన్న వృత్తులపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలి. ఈ పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతి వృత్తిదారులకు విస్తృత ప్రచారం కల్పించాలి. నోడల్ అధికారి ఉమ్మడి జిల్లాలో పర్యటించి రుణాలు సక్రమంగా అందేలా పని చేయాలి.

- యం.శ్రీనివాసులు, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్

సిబిల్ స్కోర్, పెండింగ్ రుణాలతో లింకేమిటి?



యువత, ప్రజలు స్వయం ఉపాధి చేసుకుని జీవించాలనే లక్ష్యం ప్రభుత్వానికి ఉంటే సిబిల్ స్కోర్, బ్యాంకులో రుణం పెండింగ్ ఉంటే దరఖాస్తు తీసుకోకపోవడమేమిటి. ఈ పథకం క్షేత్రస్థాయిలోకి ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించాలి. కేవలం మొక్కుబడిగా చేస్తామంటే ఎన్ని సంక్షేమ పథకాలు తెచ్చినా ఫలితం లేదు.

- మెట్టుకాడి శ్రీనివాస్, బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు

పీఎం విశ్వకర్మ నిరంతర ప్రక్రియ

పీఎం విశ్వకర్మ పథకం నిరంతర ప్రక్రియ. దరఖాస్తుదారులకు అక్నాలెడ్జ్‌మెంట్, గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నాం. లబ్ధిదారులకు రుణం తీసుకునేందుకు అవసరమైన అర్హతలను అధికారుల బృందం పరిశీలిస్తోంది. నిబద్ధతతో పని నేర్చుకునేవారికి బ్యాంకు సహకారం అందించి ఆదుకుంటుంది. సకాలంలో చెల్లిస్తే మరోసారి పెద్ద మొత్తంలో రుణం అందిస్తుంది.

-ప్రతాప్‌రెడ్డి, పీఎం విశ్వకర్మ నోడల్ అధికారి, మహబూబ్‌నగర్

మైనార్టీ గురుకులాల్లో మెరుగైన విద్య

» భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి
» రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకులాల్లో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తెలిపారు. మంగళవారం బోయపల్లి సమీపంలో నిర్మిస్తున్న మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ భవనాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. త్వరలో విద్యార్థులకు భవనాలను అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు విద్యా మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని చెప్పారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, అధికారులు

కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్‌పాష, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శంకరచారి తదితరులు పాల్గొన్నారు.

రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలి

» వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల శాస్త్రవేత్తలు

కోస్గి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులు యూ రియా వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయ పాలిటెక్నిక్ కళావాల శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం గుండుమాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాలెం వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్తలు పరిమళ్ కుమార్, జేడీ సరిత మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడిని అవలంబించి పప్పు, తృణ ధాన్యాలను మార్చి వేసుకోవాలని సూచించారు. నేల సారాన్ని పెంచు కోవడం, భూ పరిరక్షణ, నీటి సంరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. యూరియాను తగ్గించి పచ్చిరొట్ట ఎరువులను వాడాలన్నారు. రసాయన మందులకు బదులుగా జీవన రసాయ నాలు, జీవ ఎరువులు వాడడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీఏవో జాన్ సుధాకర్, జిల్లా పశు వైద్యా ధికారి ఈశ్వర్‌రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి హర్షవర్ధన్, ఏవోలు రేష్మారెడ్డి, రామకృష్ణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



కోస్గిలో కరదీపికను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పెద్దకొత్తపల్లి: పంట మార్పిడి చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం పాలెం శాస్త్రవేత్తల బృందం వెల్లడించింది. పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లి గ్రామంలో మంగళవారం రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. శాస్త్రవేత్త డాక్టర్ కే.రామకృష్ణ మాట్లాడుతూ పంటల్లో ఎరువుల యాజమాన్యం పద్ధతుల గురించి వివరించారు.

సివిల్ డిఫెన్స్ వలంటీర్స్ కోసం దరఖాస్తుల స్వీకరణ

పాలమూరు యూనివర్సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి) : యువజన సర్వీస్, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ సేవ కోసం యువతి, యువకులు సివిల్ డిఫెన్స్ వలంటీర్లుగా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం జిల్లా యువజన అధికారి వి.కోటానాయక్ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం యుద్ధ పరిస్థితులలో భాగంగా యువత సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆశిస్తుందని, దీని కోసం ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాల కోసం 9949819207 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ జట్ల ఎంపికలు



ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): జనగాంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న 4వ ఫాస్ట్-5 తెలంగాణ సబ్ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను మంగళవారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని నెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖాన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. నాలుగు జిల్లా జట్ల క్రీడాకారులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి, ప్రతిభ కనబరిచిన వారిని తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడాకారులకు అసోసియేషన్ అండగా ఉంటుందని, జిల్లాలో నెట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సాదత్‌ఖాన్, అంజద్, షరీఫ్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో వీసీ పూజలు



వీసీ సూర్యధనుంజయ, కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ సూర్య ధనుంజయ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి స్వామివారి ఆలయంలో గణపతిపూజ, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీబీఎస్ఈలో ‘స్వామి నారాయణ’ విద్యార్థుల అత్యుత్తమ ఫలితాలు



ఇషాంక్ భరత్వాల్ (98.8 శాతం)



సాయిచేతన్ (96.8 శాతం)

జడ్చర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ ఫలితాలలో మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని స్వామి నారాయణ గురుకుల పాఠశాల విద్యార్థులు అ త్యుత్తమ ఫలితాలు సాధించారు. మంగళ వారం వెల్లడైన ఫలితాలలో వంద శాతం ఫలితాలు సాధించిందని పాఠ శాల యాజమాన్యం సర్వదర్శన్‌జీ స్వామీజీ, ప్రిన్సిపాల్ తెలిపారు. 98.8 శా తంతో ఇషాంక్ భరత్వాల్ జిల్లా ప్రథమస్థానం, 96.8శాతంతో సాయిచేతన్ ద్వితీయస్థానంలో నిలిచారని తెలిపారు. ఈ అత్యుత్తమ ఫలితాలు సా ధించిన విద్యార్థులను అభినందించారు.

‘మౌంట్ బాసిల్’ విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 13 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని మౌంట్ బాసిల్ పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎస్.సాయిశ్రీ చరణ్ 492, పీ.చేతన్ 484, జే.శ్రీనిత్య 480, యు.వినయ్ గౌడ్ 478, కే.శివసాయిచరణ్ 477, బీ.సాయిచరణ్ 476 మార్కులు సాధించారు. పాఠశాలలో వంద శాతం ఉతీర్ణత సాధించారు. విద్యార్థులను చైర్‌పర్సన్ చంద్రకళవెంకటయ్య, డైరెక్టర్ శిరీషప్రవీణ్, పూజితమోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్య అభినందించారు.

ప్రతిభ కనబరిచిన ఎంవీ రామన్ విద్యార్థులు



సంస్కృతి (491)



అభిజ్ఞాసత్య (484)



శ్రీరామ్‌రెడ్డి (483)

ఆత్మకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాలలో వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ హ్యాన్సీశ్రీధర్ మంగళవారం తెలిపారు. సంస్కృతి 491, అభిజ్ఞాసత్య 484, శ్రీరామ్‌రెడ్డి 483, రామ్‌చరణ్ 481, హర్షిత 480, కార్తీక్‌రెడ్డి 480, నవదీప్ 480, కోట్ల నరేశ్ 479, పవన్ 477, నవదీప్ 475, ప్రసన్న 475, సందీప్‌రెడ్డి 474 మార్కులు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు. 191 మంది విద్యార్థులు పరీక్షలలో పాల్గొనగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

లోకాయుక్త బృందం విచారణ

అయిజ, మే 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని తూముకుంట గ్రామాన్ని లోకాయుక్త విచారణ బృందం మంగళవారం సందర్శించింది. విచారణ, ఇక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని దర్యాప్తు అధికారి మాథ్యూకోషి, నెట్టంపాడు ప్రాజెక్టు ఎస్ఈ రెహముద్దీన్ తెలిపారు. గతంలో మాజీ సర్పంచ్ అనంతరెడ్డి నెట్టెంపాడు కాలువ నీటి కారణంగా తమ పంట పొలాలు మునిపోయి నష్టం వాటిల్లుతోందని, న్యాయం చేయాలని కోరుతూ లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు బృందం పంట కాలువలను పరిశీలించారు. పరిసర గ్రామ ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ప్రాజెక్టు, కాలువలను పరిశీలించారు.



తూముకుంట గ్రామంలో ప్రజలతో వివరాలు తెలుసుకుంటున్న లోకాయుక్త దర్యాప్తు బృందం

ఇంటర్వ్యూ..

సాగులో జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తాం

- రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి



మల్దకల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు రానున్న ఖరీఫ్‌లో పంటల సాగులో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అనంతరం సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ అన్నారు. క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి పంట మార్పిడి, సాగు పద్ధతుల గురించి తెలియజేస్తామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో చెప్పారు. మరిన్ని విషయాలు వెల్లడించారు.

ఎంతమంది రైతులు భూసార పరీక్షలు చేయించుకున్నారు?

ఈ ఏడాది ఇంకా భూసార పరీక్షలు ప్రారంభించలేదు. త్వరలోనే రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ఏడాదికి 125 భూసార శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించాల్సి ఉంటుంది.

సీడ్ పత్తి నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకుంటున్నారా?

ఈఏడాది నకిలీ విత్తనాల ప్రభావం చాలా తక్కువగా ఉంది. వాటిని వాడి నష్టపోకుండా రైతులకు అవగాహన కల్పిస్తాం.

ఈ ఏడాది ఎంతమంది రైతులు బీమా చేయించుకున్నారు?

ఈ ఏడాది మొత్తం 11,047మంది రైతులు బీమా చేయించుకున్నారు. వారిలో 37 మంది రైతులు మృతిచెందారు. రూ.5లక్షల రైతు బీమా నగదును వారి కుటుంబాలకు అందజేశాము.

పంట వ్యర్థాలను కాల్చితే ఏమవుతుంది?

మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసే రైతులు పంటనూర్పిడి తర్వాత వాటి కొయ్యలను, మొదళ్లను కాల్చి వేయకుండా ఉండాలని చెప్పాం. అలా కాల్చడం వల్ల భూసారంలో నష్టం వాటిల్లుతుంది.


న్యూస్ బాక్స్

పశుసంపదను కాపాడుకోవాలి

మల్దకల్/వడ్డేపల్లి, మే13 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించి పశు సంపదను కాపాడుకోవాలని మండల పశువైద్యాధికారులు వినయ్‌కుమార్, ఉష యజమానులకు సూచించారు. మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బిజ్వారం, ఎల్కూర్ గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. శిబిరంలో 279 తెల్లపశువులు, 42 గేదెలకు గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏలు రాజేంద్ర, యుగేందర్‌రెడ్డి, గోవర్ధన్, వీఏ అర్జున్‌సింగ్ ఓఎస్‌లు రామాంజనేయులు, రాముడు, రామేశ్వరమ్మ, మధు ఉన్నారు.

● పశువులు వ్యాధులబారిన పడకుండా మందస్తుగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వడ్డేపల్లి మండల పశువైద్యాధికారి స్వరూప రాణి యజమానులకు సూచించారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని వెంకట్రామానగర్(26 కాలువ)లో పశువులకు టీకాల శిబిరం నిర్వహించారు. శిబిరంలో 24మంది రైతులకు చెందిన 75 ఆవులు, ఎద్దులకు, 126 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌వో వరప్రసాద్, ఎల్ఎస్ఏలు లతీఫ్, బుచ్చమ్మ, ఓఎస్‌లు కృష్ణ వెంకటమ్మ ఉన్నారు.

16న పౌరహక్కుల సంఘం జిల్లా మహాసభలు



పోస్టర్ విడుదల చేస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

అయిజ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న గద్వాలలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం అయిజలో విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుభాన్, ఉపాధ్యక్షుడు మహాదేవ్, కార్యవర్గసభ్యులు ఉన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పోలీసులు

వడ్డేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తనగల గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రామానాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2024 బ్యాచ్‌కు చెందిన పోలీసులు మంగళవారం గ్రామానికి వెళ్లి మృతుడి తండ్రి బోయ బుచ్చన్నకు రూ.64వేలు ఆర్థికసాయం అందజేశారు. పెళ్లి చేసుకోవడానికి సెలవు పెట్టి గ్రామానికి వచ్చి తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అసంపూర్తిగానే పెద్దవాగు బ్రిడ్జి

» శేకుపల్లివాగు బ్రిడ్జితో 13 గ్రామాలకు ఉపయోగం » వాగు పొంగితే నిలిచిపోనున్న రాకపోకలు

ఎర్రవల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేకుపల్లి గ్రామ సమీపంలోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులను దాదాపు ఏడాది క్రితం ప్రారంభించారు. దాదాపు 13గ్రామాలకు రాకపోకలు ఈ వాగుపై కొనసాగుతుండగా ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని అసంపూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండటంతో వాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలకు ఆటంకం ఏర్పడనున్నది. వర్షాలకు డైవర్షన్ వద్ద సైతం రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వ్యవసాయ పనులు మొదలైనప్పుడు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం వాగులో నీటి ప్రవహం తక్కువగా ఉందని, పనులు మొదలు పెట్టడానికి అస్కారంగా ఉన్నప్పటికీ ఎందుకు పనులు ప్రారంభించడంలేదని ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వానాకాలం నాటికి పనులు పూర్తి చేసి, అం దుబాటులోకి తేవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై ఆర్అండ్‌బీ ఏఈని వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి సంప్రదించగా స్పందించలేదు.



అసంపూర్తిగా ఉన్న శేకుపల్లి పెద్దవాగుపై బ్రిడ్జి

లబ్ధిదారుల ఎంపికపై విజిలెన్స్ విచారణ చేయాలి

» ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

» కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కుర్వ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు అందించాల్సి ఉండగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకుల వెంటఉండే కార్యకర్తలకు, బడాబాబులకు, డబ్బులు తీసుకొని అనర్హులకు అందించే ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీనివలన అర్హత ఉన్న ఇళ్లులేని నిరుపేదలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం బయటికి మాత్రం అర్హులకు కేటాయిస్తామని చెబుతూనే... కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, వారి నాయకులు అనర్హులను ఎంపిక చేసిన వారికే అంటగడుతున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు సిఫారసు లెటర్లతో ఇళ్లు కేటాయించడం అనేది ప్రజాపాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం అంటే కాంగ్రెస్ పార్టీ వారిది కాదని, ఇందులో ప్రతీ ఒక్కరికి అర్హత ఉందన్న విషయం గుర్తించాలని సూచించారు. జిల్లా అధికారులు ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితాపై పూర్తిస్థాయి విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అర్హులైన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

భూ భారతి సదస్సులు వినియోగించుకోవాలి

- గద్వాల ఆర్డీవో శ్రీనివాసరావు



ఇటిక్యాలలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఇటిక్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించుకోవాలని గద్వాల ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రైతులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. ఏళ్లక్రితం నుంచి పరిష్కారం కాని భూముల సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం అమలు చేస్తున్నామని, రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్వే నెంబరు మిస్సింగ్ కేసులు 3, సాదాబైనామాకు సంబంధించినవి 26, ఓఆర్‌సీ లేనివారు 7, ఇతర సమస్యలపై ఏడుగురు రైతులు మొత్తం 43మంది రైతులు ఫిర్యాదులు చేశారని ఇందులో ఐదుగురికి నోటీసులు సైతం ఇచ్చామని తహసీల్దార్ వీరభద్రప్ప తెలిపారు.

సమావేశంలో ఎర్రవల్లి తహసీల్దార్ నరేశ్, ఉప తహసీల్దార్ నందిని, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, ఆర్ఐ మధుమోహన్ రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రైతులు సాగులో ఖర్చు తగ్గించుకోవాలి

» ఉప్పలలో సాగుపై శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం

» అవగాహన కల్పించిన డాక్టర్ నళిని



ఉప్పల రైతువేదికలో మాట్లాడుతున్న అధికారి జనార్దన్

అయిజ, మే 13 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు ఇకపై తక్కువ మోతాదులో యూరియా వాడాలని, పంటలను బట్టి ఇది మారుతుందని పాలెం పరిశోధన కేంద్రానికి చెందిన డాక్టర్ నళిని చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని ఉప్పలలోని రైతువేదికలో నిర్వహించిన సాగుపై శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంట మార్పిడితో లాభాలు, తక్కువ నీటితో పంటల సాగు, భూసారం పెంచుకోవడం, తెగుళ్లు, పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

చెట్లను కాపాడుకోవ డం వల్ల ఉపయోగాల గురించి డాక్టర్ శంకర్ తెలిపారు. మండల వ్యవసాయాధికారి జనార్దన్ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రైతులు కచ్చితంగా రశీదు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు స్వాతి, అనిల్‌కుమార్, యువరాజ్, లోకరాజు, జయన్న, అరవింద్, సతీశ్, నవీన్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

కేటీదొడ్డి, మే 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సీరియల్ ప్రకారం మిల్లులకు పంపాలని, వివిధ కారణాలు చెబుతూ ధాన్యాన్ని సెంటర్‌లలోనే ఉంచి రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఎంపీ డీకే అరుణ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని కొండాపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్‌లో ప్రతీది రికార్డు ప్రకారం నిర్వహించడంలేదని, ప్రతీ రైతుకు టోకెన్‌సిస్టం సీరియల్ ప్రకారం లేదని, గన్నీ బ్యాగుల కొరత లేకుండా రైతుల ధాన్యాన్ని మిల్లులకు చేరేలా చూడాలన్నారు. కాంటా 40 కేజీలకు పైన 400గ్రాములు మాత్రమే తరుగు తీయాలని, కర్ణాటక సరిహద్దు నుంచి వరి ధాన్యం అక్రమంగా సెంటర్‌లకు చేరుతున్నందున అలాంటి ధాన్యం ఇక్కడికి రాకుండా అరికట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, నాయకులు అనిమిరెడ్డి, భీమ్‌రెడ్డి, స్వప్న, శ్రీనివాసులు, నాగిరెడ్డి, అంపిరెడ్డి, గోవిందు, వీరేష్ పాల్గొన్నారు.

గ్రామదేవతలకు భక్తుల ప్రత్యేక పూజలు



ఉండవల్లిలో ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న గ్రామస్థులు

గట్టు/ఉండవల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): చాగదోణ రేణుక ఎల్లమ్మవ్వకు మంగళవారం భక్త లు ప్రత్యేక పూజలుచేశారు. మంగళవారం కావడంతో భక్తులు అధికంగా తరలివచ్చారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

● ఉండవల్లి మండల కేంద్రంలోని రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఈదమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్థులు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం పెద్దలు, వివిధ గ్రామాల ప్రజలు ఉన్నారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో మాంటెస్సోరి ప్రతిభ

అలంపూరు మే 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో అలంపూరు పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని, వందశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి తెలిపారు. వీరిలో సందీప్‌రెడ్డి 488 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారని తెలిపారు.

అలాగే సాయి అహల్య 484 మార్కులతో ద్వితీయ స్థానం, కార్తిక్ యాదవ్ 480 మార్కులతో తృతీయ స్థానం సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని అన్నారు.

బీసీ గురుకులంలో ప్రవేశానికి గడువు పెంపు

గద్వాల సర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలల ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాల గడువు రాష్ట్ర గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు ఆదేశానుసారం ఈనెల 17వరకు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్ అనీలాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష లేకుండా పదో తరగతిలో వచ్చిన మార్కుల ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

ఎర్రవల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లి అంజన్న మొక్కులను భక్తులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించగా భక్తులు మంగళవారం తెల్లవారుజాము నుండే కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారికి దాసంగాలు, నైవేద్యం, తలనీలాలు సమర్పించుకుని మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చరణల మధ్య ప్రధాన అర్చకులు మారుతీచారి నిర్వహించగా, భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో రామన్‌గౌడ్ పరిశీలించారు.

వృత్త్యంతర శిక్షణతో మెరుగైన బోధన

● విద్య సమన్వయ అధికారి ఎస్తేరురాణి



మాట్లాడుతున్న సమన్వయ అధికారి ఎస్తేరురాణి

గద్వాలటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా బోధనలో తగిన మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యా సమన్వయ అధికారి ఎస్తేరు రాణి అన్నారు. ఆ దిశగా నిర్వహిస్తున్న వృత్త్యంతర శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళవారం పట్టణంలోని నర్సింగ్ కళాశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుల కోసం చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని సమన్వయ అధికారి ప్రారంభించారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు, సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

● చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ శివలీల

వడ్డేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, చట్టాలు, సంరక్షణపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ శివలీల అన్నారు. మండల కొంకలలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ వారి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల సంరక్షణపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శివలీల హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శాంతి, ఏఎన్ఎం వెంకటేశ్వర, మహిళ సాధికారత కేంద్ర సభ్యురాలు చిట్టెమ్మ, నాగరాజు, కృష్ణయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

● గట్టు: మండలంలోని తుమ్మలచెర్వులో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధికారి నరసింహ మాట్లాడుతూ బాలలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలి

» కొత్తపల్లి, రేకులపల్లిలో పర్యటించిన అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



కొత్తపల్లిలో ధాన్యం రాశిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల, మే 13(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు ప్రారంభం కాకముందే ధాన్యం మిల్లులకు చేరాలని కొనుగోళ్లను వేగవంతం చేసి రైస్‌మిల్లులకు పంపించాలని అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, రేకులపల్లి గ్రామాల్లో ధాన్యం కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ రెండు కేంద్రాల్లో మార్కెట్ నుంచి తెచ్చిన ధాన్యం విక్రయానికి వచ్చాయి. వాటిలో 663 సంచుల ధాన్యం ఇప్పటికే రైస్ మిల్లులకు తరలిపోగా రెండు లాట్‌లు ఉన్నాయి. వాటిపై అదనపు కలెక్టర్ ఆరా తీశారు. అయితే రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో అధికారులే మరోసారి పరిశీలించాలని సూచించినట్లు తెలుస్తున్నది. మిగిలిన ధాన్యాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన రికార్డులను తనిఖీ చేశారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోళ్లను వేగవంతం చేయాలని చెప్పారు. గన్నీ బ్యాగులు, లారీల కొరతపై ఆరా తీశారు. రైస్ మిల్లులలో ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసి లారీలను పంపించాలని సూచించారు. ఈ నెల చివరినాటికి ధాన్యం పూర్తిగా మిల్లులోకి చేరిపోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లికార్జున్, డీటీ అజిత్‌కుమార్, ఆర్ఐ రామకిష్ణ, ఏఈవో హరీశ్, డీపీఎం రాంమూర్తి తదితరులు ఉన్నారు.

జములమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తుల సందడి

గద్వాల, మే13 (ఆంధ్రజ్యోతి): జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో శుభకార్యాలు నిర్వహించే ముందు గ్రామదేవతలను కొలవడం ఆచారం. అందుకే రెండు వారాలుగా భక్తుల రద్దీ కొనసాగుతున్నది. ఎండను సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 50వేలకు పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ వెంకట్రాములు, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. తెల్లవారుజామున నుండే భక్తులు క్యూ కడుతున్నారు. ఆలయ గదులతో పాటు పరిసరాల్లో షామియాలను వేసుకొని నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. చీర, రవికతో పాటు వెండి పాదాలు, కడియాలు బియ్యంతో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు.

17 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ

గద్వాల, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 17మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు. వారిలో గద్వాల నియోజకవర్గం నుంచి 15మందిని బదిలీ చేయగా, అలంపూర్ నియోజకవర్గంలో ఇద్దరిని బదిలీ అయ్యింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ బదిలీల వ్యవహారాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. గద్వాల నియోజకవర్గంలో వివిధ రాజకీయ కారణాలతో బదిలీలు జరిగినట్లు తెలుస్తుంది. కానీ పరిపాలన సౌలభ్యంలో భాగంగా బదిలీ చేశామని అధికారులు మాత్రం చెప్తున్నారు. అలాగే ఆలంపూర్ నియోజకవర్గం నుంచి మరికొంత మందిని బదిలీ చేయాల్సి ఉండగా, చివరి నిమిషంలో ఓ కాంగ్రెస్ నాయకుడు రద్దు చేయించినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన కార్యదర్శులను వెంటనే రిలీవ్ చేయగా, వారు బదిలీ స్థానంలో రిపోర్టు చేశారు.

స్వచ్ఛభారత్ మిషన్‌లో రూ.7లక్షల అవినీతి

» అనంతాపురం గ్రామ కార్యదర్శి సస్పెన్షన్ » గోప్యంగా ఉంచిన అధికారులు

గద్వాల, మే 13(ఆంధ్రజ్యోతి): గద్వాల మండలం అనంతాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను కలెక్టర్ బీఎం సంతోష్ సస్పెండ్ చేశారు. శుక్రవారం సస్పెండ్ చేయగా అధికారులు ఈ విషయంను గోప్యంగా ఉంచారు. గ్రామ పంచాయతీకి స్వచ్ఛభారత్ మిషన్ (వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం)కింద నిధులు మంజూరయ్యాయి. అయితే వీటి లెక్కల్లో తేడాలు ఉండటంతో గ్రామ కార్యదర్శి శేఖర్‌ను జిల్లా పంచాయతీ అధికారి వివరణ కోరాడు. లబ్ధిదారుల ఖాతాలో జమచేసినట్లు కార్యదర్శి చెప్పాడు. అయితే అనుమానాస్పద ఖాతాలకు బదిలీలు ఉండటంతో అధికారులు గ్రామంలో విచారణ చేయగా స్వచ్ఛభారత్ మిషన్ ఖాతాలో రూ.7లక్షలు తేడా వచ్చింది. ఇవి ఎక్కడికి బదిలీ అయ్యాయని విచారణ చేయగా కొందరి వ్యక్తిగత ఖాతాలకు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించి కలెక్టర్‌కు నివేదించారు. ఈ మేరకు కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని డీఎల్‌పీవో మహేశ్ తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచడంపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదొక్క గ్రామంలోనే జరిగిందా? జిల్లాలోని మరిన్ని గ్రామాలలో జరగాయా? అనే విషయాలపై అధికారులు ఆరా తీస్తునట్లు తెలుస్తున్నది.

గద్వాలలో 680 గ్రాముల గంజాయి ఆకు స్వాధీనం

● యువకుడి అరెస్టు

గద్వాల సర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి ఆకును సరఫరా చేసేందుకు యత్నించిన ఓ యువకుడిని గద్వాల పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేసి నిందితుడి నుంచి రూ.20వేలకు పైగా విలువ గల 680గ్రాముల గంజాయి ఆకును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. పూర్తి వివరాలు గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ మంగళవారం రాత్రి గద్వాల పట్టణ పోలీసు స్టేషన్‌లో శిక్షణ ఎస్సై తరుణ్‌కుమార్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గద్వాలలోని చింతలపేటకు చెందిన బషీర్ ఏడో తరగతి వరకు చదువుకుని ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే అడ్డదారిలో డబ్బు సంపాదించాలన్న ఆశతో తనకున్న కొందరి వ్యక్తుల పరిచయాలతో హైదరాబాద్‌లోని ధూల్‌పేట, షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి గంజాయి ఆకును తెప్పించుకుని గద్వాల, చుట్టపక్కన ప్రాంతాల్లో మత్తుకు బానిసైన శ్రామికులను, మెకానిక్, డ్రైవర్లు, యువకులు, మైనర్లకు విక్రయించడం మొదలుపెట్టాడు. ఈక్రమంలోనే గద్వాలలోని మార్కెట్ యార్డు పరిసర ప్రాంతాల్లో ఓ సంచితో అనుమానాస్పదంగా తిరుగుతున్న బషీర్‌ను గద్వాల పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద సుమారు రూ.20వేలు విలువ గల 680 గ్రాముల ఎండు గంజాయి ఆకును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు.

గద్వాల కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని ఎస్సై కల్యాణ్‌కుమార్ తెలిపారు.

ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహా

గద్వాల, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని అందులో భాగంగానే బడ్జెట్‌లో నిధులు తగ్గించి పనిదినాలను కుదించిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నర్సింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి, చెనుగోనిపల్లి, గుంటిపల్లి, రేకులపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిసి ఈనెల 20న నిర్వహించే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధిలో మార్పుల కారణంగా చాలా మంది దీనిని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అందుకే కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ఈ నెల 20వ తేదిన దేశమంతట గ్రామీణ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలు బంద్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కళ్యాణ్, నరేష్, రంగన్న, మరియమ్మ, సువార్త, వంశీ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గద్వాల టౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శ్రమ దోపిడీకి అవకాశం కల్పిస్తున్న లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు కార్మిక వర్గాలన్నీ ఐక్యపోరాటాలను కొనసాగిస్తాయన్నారు. ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులతో కలిసి మంగళవారం పట్టణంలోని కార్మిక అడ్డా వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆంజనేయులు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపి వేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ థర్డ్ పార్టీ కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానం రద్దు చేసి జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివి నరసింహ, కార్తీక్, సత్యరాజు, ఉప్పేరు నరసింహ, దానయ్య, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, శాంతన్న ఉన్నారు.

● సమ్మెను విజయవంతం చేయాలి

ఉండవల్లి: కార్మికసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశ్యవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు.సమ్మె పోస్టర్లను మంగళవారం పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద కార్మికులతో కలిసి విడుదల చేశారు. అన్ని యూనియన్ల కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలన్నారు.

కార్యక్రమంలో ఉండవల్లి మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, టోల్ ప్లాజా యూనియన్ నాయకులు మద్దయ్య, రాజశేఖర్, వెంకట్ రాముడు, జయచంద్ర ఉన్నారు.